# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్:బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 1-8-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 278 పేజీలు:6 వెల: రూ.1/-


## జైపూర్ - ముంబై ఎక్స్‌ప్రెస్ రైల్లో కాల్పులు కలకలం

### – ఆర్పీఎఫ్ ఏఎస్ఐ, ముగ్గురు ప్రయాణికులు మృతి



ముంబై జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జైపూర్ – ముంబై ఎక్స్‌ప్రెస్ రైల్లో కాల్పులు కలకలం సృష్టించాయి. కోచ్ బీ5లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ జరిపిన కాల్పుల్లో నలుగురు మృతి చెందారు. ఈ ఘటన పాల్ఘర్ రైల్వే స్టేషన్ దాటిన తర్వాత సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. జైపూర్ నుంచి ముంబైకి వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో విధి నిర్వహణలో ఉన్న చేతన్ కుమార్ అనే కానిస్టేబుల్ తన వద్ద ఆటోమెటిక్ వెపన్‌తో ఏఎస్ఐ టికా రామ్ మీనాపై కాల్పులు జరిపాడు. అనంతరం మరో కోచ్‌లోకి వెళ్లి.. ముగ్గురి ప్రయాణికులపై తుపాకీతో విరుచుకుపడ్డాడు. దీంతో ఆ ముగ్గురు ప్రయాణికులు కూడా ప్రాణాలు విడిచారు. ఏఎస్ఐ కూడా చనిపోయారు. దీంతో చేతన్ కుమార్ దహిసర్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో రైలు దిగి పారిపోయేందుకు యత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు అతన్ని మీరా రోడ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. చేతన్ వద్ద ఉన్న ఆటోమెటిక్ వెపన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాల్పులు ఎందుకు జరపాల్సి వచ్చింది అనే విషయం తెలియాల్సి ఉంది.

## మాజీమంత్రి జానారెడ్డిని కలిసిన పొంగులేటి



ఖమ్మం, జులై 31: (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానా రెడ్డిని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో ఛైర్మన్, పార్టీ ఎన్నికల కమిటీ సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్ బంజారా హిల్స్ లోని వారి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసారు. ప్రజా వ్యతిరేక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి అవలంభిచాల్సిన విధివిధానాలు ఈ సందర్భంగా వారి మధ్య చర్చకు వచ్చినట్లు పొంగులేటి తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుల సలహాలు, సూచనలతో పార్టీ అభివృద్ధికి తనవంతు సేవలను అందిస్తానని పేర్కొన్నారు.

## ఇద్దరు వ్యక్తులపై కొడవలితో దాడి



ఖమ్మం, జులై 31: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మంనగరంలోని 15వడివిజన్ కొత్తగూడెంలో నివసించే పరిటాల నరసింహారావు, అతని కొడుకు గోపిచంద్ లపై అదే డివిజన్ కు చెందిన కొందరు కొడవలితో దాడిచేసి విచక్షణరహితంగా నరికినట్లు సమాచారం. దాడిలో గాయపడ్డ వారు ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందున్నారు. ఖానాపురం పోలీస్ స్టేషన్ లో బాధిత కుటింబికులు పిర్యాదు చేశారు.

### నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ అమల సవరయ నిరాకర
ణము నాక పద్ధతిగ తనమనంబున నెంచన్
విమలముగ విజయములను
క్రమముగ సాధించినాడు గాంధీ ఘనుడై!!



(1-8-1920 గాంధీజీ సవరయ నిరాకరణకు మొదటి సారిగా పిలుపు నిచ్చిన రోజు...)

–రాధశ్రీ

సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

# ఉపాధి కల్పనలో..తెలంగాణ దేశానికే రోల్‌మాడల్ : మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్, జులై 31: ఉపాధి కల్పనలో తెలంగాణ దేశానికే రోల్‌మాడల్‌గా నిలుస్తుందని, స్వరాష్ట్రంలోనే మహిళ సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని, పాలన దక్షతలో మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడంతోనే.. ప్రతి రంగంలో మహిళమణులు దూసుకెళ్తున్నారని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) వారి ఆధ్వర్యంలో 160మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం తెలంగాణకే వలస వస్తున్నారని, మహిళలు స్వయం కృషితో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో ఎక్కడా లేవని, మహిళల రక్షణకోసం షీటీమ్స్‌ను ఏర్పాటు చేశారని, అమ్మాయిల చదువు కోసం ప్రత్యేకంగా గురుకులాలు నెలకొల్పిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు.

మహిళలు కుట్టు మిషన్‌లో ప్రత్యేకతను కనబర్చి, ఇతరులకు ఉపాధిని కల్పించి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు ఏకే మురుగేష్, లలితాయాదవ్, జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, నిహారికగౌడ్, వెంట్రు ఆశాకుమారి, లావణ్యసతీష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, శారదామనోధర్‌రెడ్డి, పల్లపు రవి, వేణు, కోఆప్షన్‌సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, న్యాక్ అధికారులు, నాయకులు సాధిక్, ప్రకాష్, నవీన్‌యాదవ్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ ఐటీ హబ్‌లో 'కంపెనీ'ని స్థాపించండి : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జులై 31: త్వరలో ప్రారంభం కానున్న నిజామాబాద్ ఐటీ హబ్‌లో కంపెనీని స్థాపించాలని అంతర్జాతీయంగా పేరొందిన ప్రముఖ హిటాచీ గ్రూపు సబ్సిడరీ సంస్థ గ్లోబల్ లాజిక్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ గురు కమకొలను, కంటెంట్ ఇంజినీరింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ కృష్ణ మోహన్ వీరవల్లి ఎమ్మెల్సీ కవితతో హైదరాబాద్ లో భేటీ అయ్యారు. ఈ సమావేశం లో ఎమ్మెల్యేలు బాజీరెడ్డి గొవర్ధన్, షకీల్ కూడా పాల్గొన్నారు.

నిజామాబాద్ ఐటీ హబ్ గురించి సుదీర్ఘంగా చర్చించారు. అక్కడి రవాణా, నీరు, విద్యుత్తు వంటి సౌకర్యాలతో పాటు శాంతి భద్రత గురించి కంపెనీ ప్రతినిధులకు కవిత వివరించారు. రవాణా సౌకర్యం విషయంలో ఆర్టీసీ బస్సులను ఐటీ హబ్ వరకు వేయించడానికి కృషి చేస్తానని బాజిరెడ్డి గోవర్ధన్ స్పష్టం చేశారు. నిజామాబాద్ లో తాము కల్పించే ఉద్యోగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో కంపెనీని తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని పేర్కొన్నారు.

మంగళవారం కంపెనీ ప్రతినిధులు నిజామాబాద్ ఐటీ హబ్ ను సందర్శించనున్నారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ప్రధాన కార్యాలయం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న గ్లోబల్ లాజిక్ సంస్థకు హైదరాబాద్ లో రెండు క్యాంపస్ లు ఉన్నాయి. గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ లో వారి కంపెనీలో ప్రస్తుతం దాదాపు 3 వేల మంది పనిచేస్తున్నారు.

ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ఐటీ హబ్ లో కంపెనీని ఏర్పాటు చేయాలని తాను చేసిన విజ్ఞప్తికి గ్లోబల్ లాజిక్ కంపెనీ ప్రతినిధులు సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందని చెప్పారు. యువతకు స్థానికంగానే ఉద్యోగావకాలు కల్పించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్ అన్ని జిల్లాల్లో ఐటీ హబ్ లను ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేసి అమలు చేస్తున్నారని తెలిపారు.

కేసీఆర్ దార్శనికతకు ఇదే నిదర్శనమని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. ఐటీ హబ్ లో ఏర్పాటు చేయబోయే కంపెనీలకు అన్ని సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో నిజామాబాద్ లో మరిన్ని కంపెనీలు ఏర్పాటు అవుతాయని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. స్థానిక యువత ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలని కవిత కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల గుప్తా కూడా పాల్గొన్నారు.

## మున్నేరుముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్యచర్యలు పకడ్బందీగా చేపట్టాలి:జిల్లాకలెక్టర్



ఖమ్మం, జులై 31: (నేటినిజం ప్రతినిధి): మున్నేరు ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టర్ మున్నేరు ముంపు ప్రాంతం 35వ డివిజన్ లోని మోతినగర్ లో పర్యటించి, ముంపు సహాయక చర్యలను తనిఖీ చేశారు. ఇంటింటికి తిరుగుతూ, వరద ఏ మేరకు వచ్చింది, ఏ ఏ నష్టం మేర జరిగింది అడిగి తెలుసుకున్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి జ్వర సర్వే చేపట్టుటకు వచ్చింది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి సర్వే చేపట్టి, ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలని, నమూనాలు సేకరించి పరీక్షలు చేపట్టాలని అన్నారు. ముంపు ప్రాంతాల్లో ఇంటింటి సర్వే కు 21 బృందాలు ఏర్పాటు చేసినట్లు, ఇప్పటి వరకు 3026 ఇండ్ల సర్వే చేపట్టి, 10297 మంది కవర్ చేసినట్లు, జ్వరం, దగ్గు, జలుబు, ఒంటినొప్పులు, గొంతునొప్పి, తలనొప్పి, కండ్ల కలక తదితర లక్షణాలున్న 34 మందిని గుర్తించి చికిత్స అందించినట్లు తెలిపారు. నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, దోమల నియంత్రణకై చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యర్థాలు, చెత్త కుప్పలు తొలగించాలని, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. త్రాగునీటిలో క్లోరిన్ మాత్రలు వేసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ముంపు బాధితులకు ప్రభుత్వం ద్వారా అన్ని రకాల సహాయ చర్యల్ని చేపడతామన్నారు. ఈ నెల 25 న భారీ వర్షం తో మున్నేరు పరిసర ప్రాంత వాసులను అప్రమత్తం చేసినట్లు, పెరిగిన మున్నేరు ఉధృతి తగ్గడం, మళ్ళీ 26 న రాత్రి చాలా వేగంగా మున్నేరు ప్రమాదకర స్థాయికి చేరినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, పునరావాస కేంద్రాలకు తరలించినట్లు, కొన్నిచోట్ల భవనాల పై అంతస్తులలో ఉన్న వారు పునరావాస కేంద్రాలకు తరలుటకు సమ్మతించక పోవడం జరిగిందన్నారు. ఉధృతిని దృష్టిలో పెట్టుకొని, 27న ఉదయం ఇలాంటి వారిని 70 పై చిలుకు మందిని కాపాడడం జరిగిందన్నారు.

విద్యుత్, నీటి సరఫరా పునరుద్ధరణ జరిగిందని, రాబోయే 10 రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు ఇంటింటికి పంపిణీ చేసినట్లు ఆయన అన్నారు. ముంపు బాధితులకు సహాయార్థం దాతలు ముందుకు వస్తున్నారని, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి కోటి రూపాయలు అందించారని ఆయన తెలిపారు. 16 ఇండ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వీటి సంఖ్య పెరగవచ్చని అన్నారు. దెబ్బతిన్న ఇండ్లు, వస్తువుల అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. మున్నేరు బఫర్ జోన్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా చేసి విక్రయిస్తే, ఏమి తెలియని కొంతమంది మోసపోయి కొనుగోళ్లు చేస్తున్నారని అన్నారు. బఫర్ జోన్ మార్కింగ్ చేసి, క్రయ విక్రయాలు, కట్టడాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ దిశగా రిజిస్ట్రేషన్, రెవిన్యూ, మునిసిపల్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమావేశమై కార్యాచరణ చేస్తామన్నారు. వరదలకు పూర్తిగా దెబ్బతిన్న ఇండ్ల స్థానంలో మళ్ళీ కడితే ముప్పు ఉంటుందని వీరికి రెండు పడకల ఇండ్లు, ప్రత్యామ్నాయ ప్రదేశాల్లో పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, జిల్లా వైద్య ఆరోగ్యాధికారిణి డా. బి. మాలతి, నగర పాలక సంస్థ ఉప కమీషనర్ మల్లీశ్వరి, వైద్యాధికారులు డా. సైదులు, డా. లోహిత, డా. శ్రావ్య, అధికారులు తదితరులు ఉన్నారు.

## సమస్యల వలయంలో సాలంపుర

### –ముస్లిం కాలనీలో ఇబ్బందులు ఉన్నా పాలకుల పట్టింపు సున్నా
### –సాలంపుర అభివృద్ధిపై మంత్రి, మేయర్ కు విన్నవిస్తాం
### –ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

కరీంనగర్, జులై 31: (నేటినిజం ప్రతినిధి): నగరంలోని 17 వ డివిజన్ సాలంపుర సమస్యల వలయంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతోందని, ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విమర్శించారు. సోమవారం నగరంలోని 17వ డివిజన్ సాలం పురలో గులాం అహ్మద్ హుస్సేన్ పర్యటించారు. సాలంపుర ముస్లిం కాలనీలో సైడ్ డ్రైనేజీ సరిగా లేదని, ప్రభుత్వ పాఠశాల భవనానికి ప్రహరీ గోడ నిర్మాణం ఎప్పుడు చేపడతారని, కాలనీ ని ఆనుకొని ఉన్న చెరువు తో వరద ముప్పు పొంచిఉందని, భూస్వామి శేఖాన్ వారసులు వారి భూమిలో గోడ కడితే సాలంపుర మునగడం ఖాయమని, చెరువులో వర్షాకాలంలో శాతవాహన యూనివర్సిటీ ఏరియా నుండి వచ్చి వరద వస్తోందని, వరద ఎక్కువై కాలనీ నీట మునిగే అవకాశాలు ఉన్నాయంజారు. ముస్లిం యువత కు ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో అలసత్వం వంటి ఈఅంశాలపై, కాలనీలో అభివృద్ధిపై స్థానిక కార్పొరేటర్ ను కలిస్తే ఎలాంటి స్పందన లేకుండా పోవడం శోచనీయమన్నారు. 17వ డివిజన్ సాలంపుర అభివృద్ధి పై మేయర్ సునీల్ రావు, మంత్రి గంగుల కమలాకర్ ను, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ లను తమ పార్టీ కార్పొరేటర్లతో వెళ్లి కలుస్తామన్నారు. ఈకార్యక్రమంలో 17వ డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు ఎండి ఖదీర్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాన్, ఉపాధ్యక్షుడు యఖూబ్, కోశాధికారి షఫీం, సోషల్ మీడియా కన్వీనర్ సమీర్, రిజవాన్, డివిజన్ పెద్దలు ఖాజా ఖాన్, మహబూబ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ తాజా పరిస్థితిని విపక్ష నేతలకు వివరించిన ఎంపీల బృందం



న్యూఢిల్లీ, జులై 31:మణిపూర్ హింసాకాండ నేపథ్యంలో ఇటీవల ఆ రాష్ట్రంలో క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన విపక్ష ఎంపీలు సోమవారం విపక్ష కూటమి ఇండియా పార్లమెంటరీ పార్టీ నేతలకు అక్కడి పరిస్థితిని వివరించారు. రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే సహా పలువురు విపక్ష నేతలతో భేటీ అయిన ప్రతినిధి బృందం సభ్యులు మణిపూర్‌లో తాజా పరిస్థితిని నివేదించారు. పార్లమెంట్ భవనంలో జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ కూడా హాజరయ్యారు.

రెండు రోజుల పాటు మణిపూర్‌లో పర్యటించిన 21 మంది సభ్యులతో కూడిన విపక్ష ఎంపీల బృందం ఆదివారం మధ్యాహ్నం తిరిగి ఢిల్లీకి చేరుకుంది. ఇక అంతకుముందు మణిపూర్‌లో శాంతి నెలకొనేందుకు కుకీ, మైతీ తెగల ప్రజలు సహకరించాలని కోరుతూ శాంతికి మరో ప్రత్యామ్నాయం లేదని మణిపూర్ పర్యటన ముగించుకుని వచ్చిన అనంతరం ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా అన్నారు. మణిపూర్‌లో శాంతి పునరుద్ధరించాలని తాము కోరుతున్నామని, న్యాయంతో పాటు శాంతి స్థాపనే తమ డిమాండ్ అని పేర్కన్నారు.రెండు తెగల ప్రజలు సామరస్యంతో నివసించాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. మణిపూర్‌లో పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, మధ్యప్రదేశ్ లేదా మణిపూర్ ప్రాంతం ఏదైనా శాంతికి ప్రత్యామ్నాయం లేదని గుర్తెరగాలని మనోజ్ ఝా స్పష్టం చేశారు. 21 మంది విపక్ష నేతలతో కూడిన ప్రతినిధి బృందం రెండు రోజుల పాటు మణిపూర్‌లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులతో కూడిన వివరాలతో గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం విపక్ష బృందం తిరిగి ఢిల్లీకి చేరుకుంది.

## ఇంజినీరింగ్ రెండో విడత సీట్లు కేటాయింపు..

### –కొత్తగా 7,417 మంది విద్యార్థులకు సీట్లు కేటాయింపు.. 85.47 శాతం సీట్లు భర్తీ...

హైదరాబాద్ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో ఇంజినీరింగ్ రెండో విడుత సీట్ల కేటాయింపు పూర్తయ్యింది. ఇందులో 85.47 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. రెండో విడుతలో కొత్తగా 7,417 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఇక 25,148 మంది విద్యార్థులు తమ సీట్లను మార్చుకున్నారు. రెండో విడుత సీట్ల కేటాయింపుల తర్వాత 12,013 సీట్లు మిగిలాయి. నాలుగు యూనివర్సిటీలు, 28 ప్రయివేటు కాలేజీల్లో మొత్తంగా 32 ఇంజినీరింగ్ కాలేజీల్లో 100 శాతం సీట్లు నిండాయి. సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 2వ తేదీ లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని కన్వీనర్ సూచించారు. ఆగస్టు 4వ తేదీ నుంచి తుది విడుత కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.కంప్యూటర్ సైన్స్, ఐటీ సంబంధిత కోర్సుల్లో 94.40 శాతం సీట్లు భర్తీ కాగా, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో 78.03 శాతం, సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో 43.48 శాతం, ఇతర ఇంజినీరింగ్ కోర్సుల్లో 60.02 శాతం సీట్లు భర్తీ అయ్యాయి.

### సెల్ఫ్ రిపోర్టింగ్ ఇలా..

ఇంజినీరింగ్ సీట్లు పొందిన విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అలాట్‌మెంట్ ఆర్డర్‌లో పేర్కొన్న ఫీజును క్రెడిట్ కార్డు లేదా డెబిట్ కార్డు లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఆ తర్వాత సీటు కన్ఫర్మేషన్ అవుతుంది. అయితే ట్యూషన్ ఫీజు చెల్లించే విద్యార్థులు.. వారి తల్లిదండ్రుల ఖాతా నుంచి చెల్లిస్తే మంచిదని సూచించారు. ఎందుకంటే.. రీఫండ్ చేసేందుకు సులభంగా ఉంటుందని తెలిపారు.

## రాష్ట్ర వ్యాప్తంగా 67 మంది డీఎస్పీలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్) : తెలంగాణ పోలీసు శాఖలో పోస్టింగ్‌లు, బదిలీలు కొనసాగుతున్న విషయం విదితమే. తాజాగా డీఎస్పీలకు పోస్టింగ్‌లు ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 67 మంది డీఎస్పీలకు పోలింగ్‌లు ఇస్తూ డీజీపీ అంజనీ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కుల్సుంపుర ఏసీపీగా అబ్దుల్ జావిద్, మీర్ చైక్ ఏసీపీగా ఉమా మహేశ్వర్ రావు, వర్ధన్నపేట ఏసీపీగా వీ సురేశ్, వరంగల్ సీసీఆర్బీ ఏసీపీగా గజ్జి కృష్ణ, టీఎస్ జెన్‌కో ఏసీపీగా తిరుపతి యాదవ్, సీసీఎస్ ఏసీపీగా శంకర్ రెడ్డిని నియమించారు.

## లాలూకు ఈడీ షాక్... కోట్ల విలువైన ఆస్తులు సీజ్

న్యూఢిల్లీ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భూములకు ఉద్యోగాల కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో రాష్ట్రీయ జనతాదళ్ అధినేత, కేంద్ర మాజీ రైల్వేశాఖ మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కు చెందిన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారంనాడు జప్తు చేసింది. న్యూ ఫ్రండ్ కాలనీలోని రెసిడెన్షియల్ హౌస్‌తో పాటు లాలూ కుటుంబానికి చెందిన రూ.6 కోట్ల ఆస్తులను ఈడీ సీజ్ చేసింది.లాలూ ప్రసాద్ యాదవ్ కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఆయన, ఆయన కుటుంబ సభ్యులు బీహార్‌లో విలువైన భూములు తీసుకుని రైల్వేలో ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలపై సీబీఐ, ఈడీ ప్రస్తుతం విచారణ జరుపుతున్నాయి. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయల కుంభకోణం చేటుచేసుకుందని దర్యాప్తు సంస్థల అభియోగంగా ఉంది. యూపీఏ ప్రభుత్వం 2009లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కుంభకోణం వెలుగుచూసింది. దీంతో రైల్వే మంత్రి పదవిని లాలూ కోల్పోయారు. అప్పటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ ఈ కుంభకోణంపై సీబీఐ విచారణకు ఆదేశించారు. 2021లో తిరిగి ఈ కుంభకోణం పట్టాలెక్కింది. ప్రాథమిక దర్యాప్తు అనంతరం 2022లో లాలూ, ఆయన భార్య రబ్రీదేవి, కుమార్తెలు మీసా భారతి, హేమ యాదవ్‌లపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ప్రతిభ ప్రాతిపదికగా కాకుండా ఆశ్రితపక్షపాతంపై లాలూ కార్యాలయం నియామకాలు జరిపినట్టు విచారణలో వెల్లడైంది. రైల్వే మంత్రిగా లాలూ అధికార దుర్వినియోగానికి తన కుటుంబ సభ్యులు, సన్నిహితులకు లబ్ధి చేకూర్చారని దర్యాప్తు సంస్థలు చెబుతున్నారు.2004-2009 మధ్య పాట్నాకు చెందిన పలువురుని గ్రూప్-డి పోస్టుల్లో రిక్రూట్ చేశారని ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పేర్కొంది. ఈ పోస్టుల కోసం ఎలాంటి అడ్వర్‌టైజ్‌మెంట్లు ఇవ్వలేదని, రిక్రూట్‌మెంట్ నిబంధనలకు వ్యతిరేకంగా నియామకాలు జరిగాయని తెలిపింది. ముంబై, జబల్‌పూర్, కోల్‌కతా, జైపూర్, హాజీపూర్ వంటి వివిధ రైల్వే జోన్లలో అభ్యర్థుల నియామకాలు జరిగాయని పేర్కొంది. ఈ కుంభకోణం ద్వారా లక్ష చదరపుటడుగుల భూమిని కేవలం రూ.26 లక్షలకే లాలూ కుటుంబ సభ్యులు సేకరించారని, అయితే వీటి విలువ రూ.4.39 కోట్లపైమాటేనని సీబీఐ ఆరోపిస్తోంది. కాగా, ఈడీ సైతం ఈ కుంభకోణానికి సంబంధించి ఢిల్లీ, పాట్నా, ముంబై, రాంచీలోని 24 ప్రాంతాల్లో ఇంతకుముందు గాలింపు చర్యలు జరిపింది. ఈ దాడుల్లో లెక్కల్లో చూపించని కోటి రూపాయల నగదును, విదేశీ కరెన్సీ, బంగారు నగలు స్వాధీనం చేసుకుంది.

## మాణిక్ రావ్ ఠాక్రేతో జానారెడ్డి పొంగులేటి భేటి



ఖమ్మం, జులై 31: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జీ మాణిక్ రావ్ ఠాక్రేతో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానా రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో ఛైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం భేటి అయ్యారు. హైదరాబాద్ బంజారా హిల్స్ లోని జానారెడ్డి నివాసంలో ఈ భేటి జరిగింది. ప్రజా వ్యతిరేక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి అవలంభిచాల్సిన విధివిధానాలు ఈ సందర్భంగా వారి మధ్య చర్చకు వచ్చినట్లు పొంగులేటి తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుల సలహాలు, సూచనలతో పార్టీ అభివృద్ధికి తనవంతు సేవలను అందిస్తానని పేర్కొన్నారు.

# అమ్మ తల్లిపాల పట్ల సమగ్ర అవగాహన అవసరం

## (01-07 ఆగష్టు 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు' సందర్భంగా)

అమృతతుల్యమైన అమ్మపాలలో శిశు సమగ్రాభివృద్ధికి దోహదపడే మాంసకృత్తులు, పిండి పదార్థాలు, ఐరన్, కాల్షియం, ఖనిజాలు, యాంటీబాడీలు, విటమిన్లు, కొవ్వులతో పాటు అనేక ఇతర పోషకాలు సమపాళ్ళలో ఉంటాయి. న్యుమోనియా, కలరా, కామెర్లు లాంటి పలు వ్యాధుల నుంచి శిశువును రక్షించగలిగే అమ్మ రొమ్ము పాలు జీవితాంతం వ్యాధినిరోధకశక్తిని అందించే అత్యుత్తమ సహజ టీకా ఔషధంగా పని చేస్తుంది. తల్లిపాలు అందించడంతో శిశువు ఎదుగుదలే కాకుండా తల్లి ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. బిడ్డ ప్రసవం జరగ్గానే లభించే ముర్రు పాలలో అద్వితీయ పోషక విలువలు ఉంటాయి. ముర్రు పాలతో ప్రత్యేక పోషకాలు లభించడమే కాకుండా వ్యాధికారక వైరస్‌లు, బ్యాక్టీరియాల పట్ల నిరోధకశక్తి పెరుగుతుంది. ముర్రుపాలు మంచివి కావనే దురభిప్రాయాలను దూరం చేస్తూ, రొమ్ము పాలు తప్పక కనీసం ఒక ఏడాదికి పైగా తాగించి, శిశువు జీవితకాల ఆరోగ్యానికి పుణాదులు వేయాలి. ముర్రు పాలతో శిశువు పేగుల శుద్ధి జరగడం, ఎలర్జీలను నిరోధించడం, జీవితాంతం పలు ప్రమాదకర రోగాలు రాకుండా నివారించడం, శిశు శారీరక మానసిక వికాసానికి దోహదపడడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి.

### ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు-2023 నినాదం:

శిశు జననం నుంచి కనీసం ఆరు మాసాల వరకు అమ్మ రొమ్ముపాలు తప్పనిసరిగా అందించాలి. శిశువు ఆరు మాసాలు దాటిన తరువాత 1-2 ఏండ్ల పాటు అమ్మ రొమ్ముపాలు అందించడం ద్వారా పిల్లల సమగ్ర ఎదుగుదల సమకూరుతుంది. తల్లి రొమ్ముపాల ప్రాధాన్యతను మాతృమూర్తులకు వివరించడానికి ప్రతి ఏటా ఆగష్టు 01-07 వరకు 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాల'ను ఘనంగా నిర్వహించుట జరుగుతున్నది. 1992లో ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలను 170కి పైగా ఐరాస సభ్యదేశాలు పాటిస్తున్నాయి. యూనిసెఫ్, డబ్ల్యూహెచ్ఓ, స్థానిక ప్రభుత్వాలు సంయుక్తంగా తల్లిపాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు-2023 నినాదంగా 'ఉద్యోగ ఉపాధుల్లో ఉన్న తల్లితండ్రుల శిశువులకు తల్లిపాలు పట్టించే వెసులుబాటు కల్పిద్దాం(ఎనేబ్లింగ్ బ్రెస్ట్‌ఫీడింగ్ : మైకింగ్ ఏ డిఫరెన్స్ ఇన్ వర్కింగ్ పేరెంట్స్)' అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు.

### సంపన్న వర్గాల పిల్లలకు అందని అమ్మపాలు:

ప్రపంచవ్యాప్తంగా 7.6 మిలియన్ల శిశువులకు తల్లి పాలు అందడం లేదని, అధిక ఆదాయ వర్గాల్లో 21 శాతం, మధ్య తరగతి పిల్లల్లో 4 శాతం రొమ్ముపాల రుచిని చూడడమే లేదు. ఇండియా, చైనా, నైజీరియా, ఇండోనేషియా లాంటి దేశాల్లో తల్లిపాలు లభించని కారణంగా పలు వ్యాధులతో ప్రతి ఏట లక్షల శిశు మరణాలు నమోదు అవుతున్నాయి. భారతదేశంలో 79 శాతం ప్రసవాలు ఆరోగ్య కేంద్రాలలో జరిగినప్పటికీ, తొలి గంటలో 42.6 శాతం తల్లులు మాత్రమే రొమ్ము పాలు అందిస్తున్నారని తెలుస్తున్నది. తొలి ఆరు మాసాలు తల్లి పాలు మాత్రమే అందించి, అనంతరం అదనపు పోషకాహారంతో పాటు రొమ్ముపాలు అందించాలి. సంపన్న కుటుంబాల తల్లుల కంటే పేద కుటుంబాల తల్లులే అధికంగా చనుబాలను అందిస్తున్నారు.

### రొమ్ముపాలు పట్టించడంతో తల్లిబిడ్డల ఆరోగ్యం:

శిశు జననంతో తల్లి రెమ్ము పాలు ఉత్పత్తి కావడం, నవజాత శిశువు రొమ్ము పట్టి పాలు త్రాగడం, తల్లిబిడ్డల మధ్య అద్వితీయ ప్రేమానుబంధాలు ఉద్భవించడం ఓ అద్భుత సృష్టి రహస్యమనే చెప్పాలి. తల్లి రొమ్ముపాలు అందించాలనే లక్ష్యంతో ఉద్యోగిణులకు, ఉద్యోగులకు ప్రత్యేక సెలవుల సౌకర్యం కల్పించబడింది. రొమ్ముపాలు పట్టించడం వల్ల తల్లులకు రొమ్ము కాన్సర్, ఓవేరియన్ కాన్సర్, మధుమేహం, స్థూలకాయం, రక్తస్రావం, గుండె జబ్బులు, వెంటనే గర్భం దాల్చే అవకాశం లాంటి సమస్యలు రాకుండా అడ్డుకుంటాయి. తల్లి పాలు ఇవ్వడం వల్ల శారీరక సౌందర్యం తగ్గుతుందనే దురభిప్రాయంతో సంపన్న కుటుంబాల్లోని తల్లులు రొమ్ముపాలు ఇవ్వడానికి చొరవ చూపక పోవడం అమానవీయం, ఆక్షేపణీయం. తల్లిపాల పట్ల విస్తృత అవగాహన కల్పించినప్పటికి 50 శాతం తల్లులు తొలి ఆరు మాసాలు, 25 శాతం తొలి ఏడాది వరకు రొమ్ముపాలు అందిస్తున్నారని తేలింది.

### అమ్మ పాల ప్రాముఖ్యతను తెలియజేయడం:

పేద కుటుంబాల్లో తల్లుల అనారోగ్యం, పాలు పడకపోవడం, పని ఒత్తిడిలో నిర్లక్ష్యం చేయడం, అవగాహన లేకపోవడం లాంటి కారణాలతో పిల్లలు బలహీనంగా ఉంటూ, రోగాల పాలు కావడం, కొన్ని సందర్భాలలో మరణించడం కూడా సంభవిస్తున్నాయి. కరోనా విపత్తులో పేదరికం పెరగడం, ఆర్థికంగా చితికి పోవడం, ఉపాధులు లేకపోవడంతో తల్లిపాలు అందించడంలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. గర్భిణి, తల్లి, శిశువు ఆరోగ్య రక్షణకు అవసరమైన ఆసుపత్రులను నెలకొల్పవలసిన కనీస బాధ్యత ప్రభుత్వాల మీద ఉంటుంది. తల్లి, బిడ్డలతో పాటు సకల జనుల ఆరోగ్య సౌభాగ్యాలకు పుణాదిగా నిలుస్తున్న తల్లిపాలను రక్షించి, చిన్నారులకు అందించి, ఆరోగ్య సమాజాన్ని నిర్మించే ప్రయత్నాలు చేద్దాం, లేత శిశువు ఎదుగుదలకు కంకణ బద్ధులం అవుదాం. గర్భం దాల్చడం, రొమ్ముపాలు అందించడం అనే ముఖ్య అంశాలే రేపటి సమాజ నిర్మాణానికి దోహదపడతాయని గుర్తుంచుకోవాలి.

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మాతశిశు ఆరోగ్యం, పోషకాహారం, పేదరిక నిర్మూలన, ఆహార భద్రత లాంటి అంశాలకు ప్రాధాన్యతలను ఇవ్వాలి. నేటి శిశువులే రేపటి ఆరోగ్య పౌర వెలుగులని, రొమ్ముపాలు అమృతాహారమని సమాజాన్ని జాగృత పరుద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ప్రపంచ మానవాళికి పేదరికమే శాపంగా మారింది

## -లయన్ జిల్లా గవర్నర్ హనుమాండ్ల రాజి రెడ్డి




హైదరాబాద్, జులై 31:అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి దేశాల ప్రజలకు పేదరికమే శాపంగా మారి, బక్కచిక్కిన డొక్కలతో అమానవీయంగా బతకడం విచారకరమని లయన్ జిల్లా గవర్నర్ హనువాండ్ల రాజి రెడ్డి అన్నారు. ఈ రోజు ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ గట్టమనేనీ బాబురావు జన్మదినం సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌ను కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ నేడు పూర్వ కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాల్లో వ్యాపించి ఉన్న 95 లయన్స్ క్లబ్బుల ద్వారా ఆయా ప్రాంతాల్లో బాబు రావు జన్మదిన వేడుకలతో పాటు దాదాపు లక్ష మందికి ఉచితంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ పట్యణంలో విస్తరించి ఉన్న 20 క్లబ్బులు దాదాపు 2000 మంది పేదలకు అన్నామృత వితరణ చేపట్టారని తెలిపారు. కరీంనగర్ బస్‌స్టాండ్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి అవసరార్థుల ఆకలిని తీర్చడం సంతోషదాయకమని అన్నారు.

ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా హాజరైన ఉప జిల్లా గవర్నర్ లయన్ ఎన్ కోదండరావ్ మాట్లాడుతూ మన లయన్ జిల్లా ఆధ్వర్యంలో ప్రతి రోజు 300 మంది అవసరార్థులకు అల్పాహారం ఉచితంగా నగరంలోని వివిధ కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్నామని, నేడు లయన్ జి బాబు రావు గారి జన్మదినం సందర్భంగా మధ్యాహ్న భోజనం వివిధ ప్రాంతాల్లో 2000 మందికి అందిస్తున్నామని, పేదలకు అన్న ప్రసాదం అందించడం మాకు సంతృప్తికరంగా ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కెబినెట్ కార్యదర్శి లయన్ మంద వెంకట రమణా రెడ్డి, అదనపు కార్యదర్శి లయన్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ఆర్‌సి జి లక్ష్మయ్య, జెడ్‌సిలు లయన్ రావికంటా కృష్ణ కిషోర్, లయన్ విష్ణువర్ధన్ రెడ్డి, లయన్ శ్రీహరి రెడ్డి, లయన్ జిల్లా అంజయ్య, లయన్ సీతారాం రెడ్డి, కోర్‌టీం సభ్యులు లయన్ కోమల్ల రాజెందర్ రెడ్డి, లయన్ ఇనుగుర్తి రమేష్, లయన్ పాత శేఖర్‌లతే పాటు నరగంలోని వివిధ లయన్స్ క్లబ్బుల అధ్యక్షులు, కార్యదర్శులు, కోషాధికారులు, ఇతర సభ్యులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఈడీ కేసు..

## నాలుగు కార్లు, నగలు, నగదు సీజ్

న్యూఢిల్లీ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: హర్యానా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ధరమ్ సింగ్ చొక్కర్‌తో పాటు అతని కంపెనీలకు చెందిన ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేపడుతున్న విషయం తెలిసిందే. మనీల్యాండరింగ్ కేసులో ఆయన్ను విచారిస్తున్నారు. అయితే ఇవాళ ఆ ఎమ్మెల్యేకు చెందిన నాలుగు లగ్జరీ కార్లతో పాటు 14.5 లక్షల విలువైన జ్యువలరీ, 5 లక్షల నగదును ఈడీ సీజ్ చేసింది. ఇండ్ల కొనుగోలుదా రులన మోసం చేసినట్లు ఎమ్మెల్యే ధరమ్ సింగ్‌పై ఆరోపణలు ఉన్నా యి. ధరమ్ చోకర్ కుటుంబానికి చెం దిన సభ్యులు సాయి అయినా ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రియల్ ఎస్టేట్ కంపెనీ నడుపుతున్నారు. దాంట్లో మహిరా ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ కూడా ఉంది. సామల్కా, గురుగ్రామ్, ఢిల్లీ నగరాల్లో ఈడీ తనిఖీలు చేసిం ది. 1497 మంది కొనుగోలుదారుల నుంచి సుమారు 360 కోట్లు వసూల్ చేసినట్లు సాయి అయినా ఫార్మ్స్ కంపెనీపై గురుగ్రామ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తనిఖీల సమయంలో చోకర్ కుటుంబసభ్యులు దర్యాప్తులో పాల్గొనలేదని ఈడీ పేర్కొన్నది.

# ఆగస్టు 1న పూణె సందర్శించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 31:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మహారాష్ట్రలోని పూణెని , ఆగస్టు 1న సందర్శిస్తారు. ఆరోజు ఉదయం 11 గంటలకు ప్రధానమంత్రి దగడుషేత్ మందిర్‌ను దర్శించి, పూజ చేస్తారు. ఉదయం గం 11.45 లకు ప్రధానమంత్రి లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం అందుకుంటారు. అనంతరం 12.45 గంటలకు ప్రధానమంత్రి మెట్రోరైలు సర్వీసులను జెండా ఊపి ప్రారంభిస్తారు. అలాగే పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు.

పూణే మెట్రో తొలి దశ లోని రెండు కారిడార్ లలో పూర్తి అయిన సెక్షన్లలో ప్రధానమంత్రి , జెండా ఊపి రైలు సర్వీసులను ప్రారంభిస్తారు. ఇవి, ఫూగేవాడి స్టేషన్ నుంచి సివిల్ కోర్టు స్టేషన్, గర్వారే కాలేజ్ స్టేషన్ నుంచి రూబీ హాల్ క్లినిక్ స్టేషన్ ఉన్నాయి. ఈ ప్రాజెక్టుకు 2016లో ప్రధానమంత్రే శంకుస్థాపన చేశారు. నూతన సెక్షన్లు పూణే నగరంలోని ప్రధాన ప్రాంతాలైన శివాజీ నగర్, సివిల్ కోర్టు , పూణె మునిసిపల్ కార్పొరేషన్ ఆఫీస్, పూణె ఆర్.టి.ఒ, పూణె రైల్వే స్టేషన్ లను కలుపుతాయి. ప్రజలకు ఆధునిక ,పర్యావరణ హితకరమైన సత్వర నగర రవాణా వ్యవస్థను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తేవాలన్న ప్రధానమంత్రి దార్శనికత దిశగా ఈ ప్రారంభోత్సవం ఒక ముందడుగు కాగలదు.

కొన్ని మెట్రోస్టేషన్ల డిజైన్ ఛత్రపతి శివాజీ మహరాజ్ ప్రేరణను అందించేవిగా ఉన్నాయి. ఛత్రపతి శంభాజీ ఉదయన్ మెట్రో స్టేషన్, దక్కన్ జింఖానా మెట్రోస్టేషన్లను ఛత్రపతి శివాజీ మహరాజ్ పాలనలో సైనికులు ధరించే తలపాగా రూపంలో తీర్చిదిద్దారు. దీనిని మవలా పగడి అంటారు. శివాజీ నగర్ అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్, ఛత్రపతి శివాజీ మహరాజ్ నిర్మించిన కోటలను గుర్తుకుతెస్తుంది.

మరో ముఖ్యమైన ఫీచర్ ఏమంటే, సివిల్ కోర్టు మెట్రో స్టేషన్, దేశంలోని అత్యంత లోతైన మెట్రో స్టేషన్లలో ఒకటి. ది 33.1 మీటర్ల లోతులో ఉంది. ఈ మెట్రో స్టేషన్ ప్లాట్ ఫాంపై నేరుగా సూర్యరశ్మి పడేట్టు స్టేషన్ పైకప్పును రూపొందించారు.

ప్రధానమంత్రి తన పర్యటనలో భాగంగా, పింప్రి చించ్ వాడ మునిసిపల్ కార్పొరేషన్ (పిసిఎంసి) మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వ్యర్థాలనుంచి ఇంధనాన్ని తయారు చేసే ప్లాంటును ప్రారంభిస్తారు. ఈ ప్లాంటును 300 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టారు. ఇది సంవత్సరానికి 2.5 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను ఉపయోగించి విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది.

అందరికి గ్రుహ సదుపాయం అన్న లక్ష్యసాధనలో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద, పిసిఎంసి నిర్మించిన 1280 ఇళ్లను ప్రధానమంత్రి, లబ్దిదారులకు అందజేస్తారు. పూణే మునిసిపల్ కార్పొరేషన్ పిఎంఎవై కింద నిర్మించిన 2650 ఇళ్లను, పూణే మెట్రోపాలిటన్ రీజియన్ డవలప్ మెంట్ అథారిటీ నిర్మించిన 6400 ఇళ్లను కూడా ప్రధానమంత్రి లబ్ధిదారులకు అందజేస్తారు.

ప్రధానమంత్రి కి ఆగస్టు 1న లోకమాన్య తిలక్ జాతీయ అవార్డును అందజేస్తారు. ఈ అవార్డును తిలక్ స్మారక్ మందిర్ ట్రస్ట్ 1983లో ఏర్పాటు చేసింది. లోకమాన్య తిలక్ పట్ల గౌరవసూచకంగా ఈ అవార్డును ఏర్పాటుచేశారు. దేశ పురోగతి అభివృద్ధికి విశేష క్రుషి చేసిన వారికి ఈ అవార్డు ఇస్తారు. ఈ అవార్డును ప్రతి ఏడాది ఆగస్టు 1 వతేదీన లోకమాన్య తిలక్ వర్ధంతి సందర్భంగా అందజేస్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోకమాన్య తిలక్ అవార్డు అందుకుంటున్న 41 వ వ్యక్తి . గతంలో ఈ అవార్డును అందుకున్న వారిలో డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ, శ్రీ ప్రణబ్ ముఖర్జీ, శ్రీ అటల్ బిహారి వాజ్ పేయీ, శ్రీమతి ఇందిరా గాంధీ, డాక్టర్ మన్ మోహన్ సింగ్, శ్రీ ఎన్.ఆర్.నారాయణ మూర్తి, డాక్టర్. ఇ. శ్రీధరన్ తదితరులు ఉన్నారు.

# నాగయ్య మృతదేహానికి నివాళులర్పించిన పరికపల్లి శ్రీనివాస్



ఖమ్మం, జులై 31: (నేటినిజం ప్రతినిధి): కొనిజర్లమండలం పెద్దగోపతి గ్రామపంచాయితీలో అనంతారం గ్రామానికి చెందిన కోట నాగయ్య గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన పార్థీవదేహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నేత పెద్దమునగాల గ్రామసర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకులు దొడ్డా బాబు, ఈ సందర్భంగా మాట్లాడుతూ... నాగయ్య ఆకస్మికంగా మృతి చెందడం చాలా బాధాకరమని వారి కుటుంబానికి తీరనిలోటని వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మనోధైర్యాన్ని నింపి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉటుకూరి రంజిత్, పునాటి బాబు, పాంగంటి చిన్న బాబు, నక్క కిషోర్, గండమాల జయరాజు, నక్క బాబు, జోగేశ్వర రావు, అగస్టిన్, జెట్టి కృష్ణ, అనుమోలు కృష్ణ, శ్రీను, ఉసికల నవీన్, డాకూరి రవి, నక్క అశోక్, కృష్ణ ఉన్నారు.

# నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్స్- ఆయిల్ పామ్ కింద

## ఆయిల్ పామ్ సాగు కోసం మెగా ప్లాంటేషన్ డ్రైవ్ 2023

న్యూఢిల్లీ, జులై 31:ఆయిల్ పామ్ ఉత్పత్తి విస్తీర్ణాన్ని 10 లక్షల హెక్టార్లకు పెంచడం మరియు 2025-26 నాటికి క్రూడ్ పామ్ ఆయిల్ ఉత్పత్తిని 11.20 లక్షల టన్నులకు పెంచే లక్ష్యంతో భారత ప్రభుత్వం 2021 ఆగస్టులో నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ పామ్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం వంట నూనెల ఉత్పత్తిలో గణనీయమైన వృద్ధితో పాటు దిగుమతి భారాన్ని తగ్గించడం ద్వారా భారతదేశాన్ని 'ఆత్మ నిర్భర్ భారత్' వైపు విజయవంతంగా నడిపిస్తోంది.

ఈ మిషన్ కింద దేశంలో ఆయిల్ పామ్ సాగును మరింత పెంచడానికి ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కంపెనీలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు 25 జూలై 2023 నుండి మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించాయి. మూడు ప్రధాన ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కంపెనీలైన పతంజలి ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్, గోద్రెజ్ ఆగ్రోవెట్, మరియు 3ఎఫ్‌లు రికార్డు విస్తీర్ణ విస్తరణ కోసం తమ తమ రాష్ట్రాల్లోని రైతులతో చురుకుగా ప్రచారం చేస్తున్నాయి మరియు పాల్గొంటున్నాయి.

మెగా ప్లాంటేషన్ డ్రైవ్ 25 జూలై 2023న ప్రారంభమైంది మరియు ఆగస్టు 12, 2023 వరకు కొనసాగుతుంది. ఆయిల్ పామ్ పండించే ప్రధాన రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, గోవా, అస్సాం, త్రిపుర, నాగాలాండ్, మిజోరం మరియు అరుణాచల్ ప్రదేశ్‌లు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నాయి.

ఈ డ్రైవ్ 25 జూలై 2023న రెస్ట్ ఆఫ్ ఇండియా (ఆర్ఒఐ) రాష్ట్రాలలో అంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒడిషా, గోవా, కర్ణాటకలో ప్రారంభమైంది మరియు 08-08-2023 వరకు కొనసాగుతుంది మరియు దాదాపు 7000 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంటుంది. 6500 హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ పరిధిలోకి రావాలని లక్ష్యంగా పెట్టుకుంది.

అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మిజోరం మరియు నాగాలాండ్ వంటి ఈశాన్య ప్రాంత (ఎన్ఈఆర్) రాష్ట్రాలలో ఈ డ్రైవ్ జూలై 27, 2023న ప్రారంభమైంది మరియు 19 జిల్లాల్లో 750 హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో 12 ఆగస్టు 2023 వరకు కొనసాగుతుంది.

27 జూలై 2023 నుండి ఆగస్టు 05, 2023 వరకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో ఉన్న 8 జిల్లాల్లో 75 హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో మొక్కలు నాటాలని అస్సాం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో జరుగుతున్న ఈ డ్రైవ్‌లో గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్, పతంజలి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, 3ఎఫ్ ఆయిల్ పామ్ లిమిటెడ్ మరియు కెఈ కల్టివేషన్ కంపెనీలు ఈ డ్రైవ్‌లో పాల్గొంటున్నాయి.

29 జూలై 2023 నుండి ఆగస్టు 12, 2023 వరకు 6 జిల్లాల్లో జరిగే ఈ డ్రైవ్‌లో దాదాపు 700 హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కలు నాటాలని అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ డ్రైవ్‌లో 3ఎఫ్‌ప్రైవేట్. లిమిటెడ్ మరియు పతంజలి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లు రాష్ట్రంలో జరిగే ఈ డ్రైవ్‌లో పాల్గొంటున్నాయి.

# ఐటీ కారిడార్‌లో మహిళల కోసం ప్రత్యేక బస్సు సర్వీస్

హైదరాబాద్, జులై 31:హైదరాబాద్ నగరంలోని ఐటీ కారిడార్‌లో మహిళల కోసం ప్రత్యేక బస్సును టీఎస్ఆర్టీసీనేడు ప్రారంభించింది. జేఎన్‌టీయూ-వేవ్‌రాక్ మార్గంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ బస్సు నడుస్తుందని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు.

ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. మహిళా ప్రయాణికుల సౌకర్యార్థం త్వరలోనే మరిన్ని ప్రత్యేక బస్సులను టీఎస్ఆర్టీసీ ఏర్పాటు చేయనుందని తెలిపారు. ఐటీ కారిడార్‌లో రాకపోకలకు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని మహిళలను ఆర్టీసీ కోరుతునున్నట్లు సజ్జనార్ పేర్కొన్నారు.

# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కరీంనగర్, జులై 31: పాఠశాలలోని ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యాబోధన జరపాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రగతి నగర్ లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో పాఠ్యాంశాలకు సంబంధించి పలు ప్రశ్నలను అడిగి విద్యార్థుల విషయ పరిజ్ఞానం, చదివే, రాసే సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులు ఇచ్చిన సమాధానాలు, చదివే, రాసే సామర్థ్యం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాలలో అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ తక్కువ అటెండెన్స్ ఉన్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారి తల్లిదండ్రులతో చర్చించి పాఠశాలకు రెగ్యులర్ గా వచ్చే విధంగా, హాజరు శాతం మెరుగుపరిచే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో నిబంధన ప్రకారం పేరెంట్, టీచర్స్ మీటింగ్ పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలోని ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించి వారి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా కృషి చేయాలన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీ రూమ్ ను పరిశీలించి ప్రతిరోజు విద్యార్థులు కనీసం గంట సమయం గ్రంథాలయంలో గడపాలని, విద్యార్థులు చదవడం అలవర్చుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రమాదేవి, టీచర్స్ అనిత, రమ్య, తదితరులు ఉన్నారు.

# భగ్గుమంటున్న కూరగాయలు ధరలు.. 180 దాటేసిన టమాటా రేటు



అమరావతి, జులై 31:అన్ని వర్గాల ప్రజలకు కూరగాయలు ధరలు సగటు జనానికి శరాఘాతంగా మారాయనీ అల్లూరిసీతారారాజుజిల్లా వి అర్ పురం మండల ప్రజలువాపోతున్నారు.. తమ మొప్పు కోసం బటన్ నొక్కి ఉచితంగా డబ్బులు వేస్తున్న ప్రభుత్వం వాటిని పూడ్చుడానికి మా మీద మోయలేని భారాలు మోపుతుంటే సామాన్య జనం పరిస్థితి నేడు అత్యంత దయనీయంగా మారిందని మండల ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏనాడు అయిన టమాటా ఇంత రేటు ఉందా రోజెంతా కష్ట పడితే వచ్చే కూలీ డబ్బులు200 లేక 300 ఈ మూడు వందల లో 180 టమాటా కొనగలమా ఇదేమీ దౌర్భాగ్య దుస్థితి అంటూ ప్రజలు భాహిరంగం గానే అసహనం వెలిబుచ్చుతున్నారు.

గతంలో 2 వందల రూపాయలు పట్టుకెలితే సరిపడా సరుకులు వచ్చేవి ఇప్పుడు 1000 రూపాయలు తీసుకెలితే సంచి నిండని వైనం వంట నూనె ఉల్లి అన్ని రకాల కూరగాయలు ధరలు మార్కెట్లో కొనాలంటే పెరిగిన ధరలు తో కొనలేక కారం మెతుకులు తింటున్నదుస్థితి వుందని జనం గగ్గోలు పెడుతున్నారు. ఏడాది కాలంగా ఇదే ధరలు ఒక్కొక్కటి పెంచుకుంటూ పోతున్నారు. తప్ప జనంపడుతున్న ఇబ్బందులు ఈ ప్రభుత్వానికి ఎందుకు పట్టడం లేదు అని మండి పడుతున్నారు. ప్రజలు.

ఒక పక్క వరద విపత్తులు అతలాకుతలం చేస్తుంటే మూలిగే నక్క పై తాటి కాయ పడ్డ చందాన వడ్డన మీద వడ్డన చేస్తూ రోజూ రోజుకు ఆకాశాన్ని తాకేలా నిత్యావసరాల ధరలు నింగికి తాకి సగటు కుటుంబాల దైనందిన జీవితాలు చిద్రం గా దర్శన మిస్తున్నాయనీ పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కూరగాయలు కొందామంటే కొరివి తిందామంటే అడవి అన్నట్లు ఉంది ఈ ప్రభుత్వంలో అంటూ నిట్టుర్చుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ఉచిత పదకాల పై ఉన్న శ్రద్ధ సగటు మానవుని నిత్య కృత్యం అయిన కూరగాయలు ధరలు వెంటనే నియంత్రణ చేపట్టి అన్ని రకాల ధరలు తగ్గించాలని ముక్త కంఠంతో ప్రజలు కోరుతున్నారు.

# ఇంటింటా ఇన్నోవేటర్ దరఖాస్తుల ఆహ్వానం - జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి , జూలై 31 (నేటినిజం ప్రతినిధి): ఇంటింటా ఇన్నోవేటర్ కు ఆవిష్కర్తల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. సామాజిక సమస్యలకు విస్తృతమైన పరిష్కారాలు రూపొందించిన వారి ఆవిష్కరణలు ఆగస్టు 15 న స్వాతంత్ర దినోత్సవం నాడు ప్రదర్శించడానికి రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటా ఉన్న ఆవిష్కర్తలు వివిధ సమస్యలకు పరిష్కారం కనుగొనేలా ప్రోత్సహిస్తుందన్నారు. ఎంపికైన ఆవిష్కరణలు స్వాతంత్ర దినోత్సవం నాడు జిల్లాలో ప్రదర్శించడానికి అవకాశం ఉంటుం దని ఆయన పేర్కొన్నారు. మన సమాజంలో లేదా చుట్టుపక్కల ఉన్న సమస్యలు, విద్యాలయాల్లో, వ్యవసాయరంగానికి, ఏ రంగానికి సంబంధించినదైనా వాటిని పరిష్కరించే వినూత్న ఆలోచన/పరికరమే ఆవిష్కరణగా రూపొందు

తుందన్నారు. ఏదైనా సమస్యకు కొత్త పరిష్కారం కనుక్కున్నా, సమస్యకు పరిష్కారం కనుక్కునే విధానం నూతనంగా ఉన్నా ఆవిష్కరణగా పేర్కొంటారని, అదేవిధంగా ఒక పరికరం చేస్తూ దాని లో ఉపయోగించే వస్తువులు/పరికరాలు వినూత్నంగా ఉన్నా, ఉన్న వస్తువులకు మరింత ఆలోచన జోడించి వస్తువు ఉపయోగాలు పెరిగినా ఆవిష్కరణగా పరిగణిస్తారని ఆయన వివరించారు. ఆవిష్కర్తలు తమ ఆవిష్కరణకు సంబంధించిన ఆరు వాక్యాలు, రెండు నిమిషాల వీడియోను, ఆవిష్కరణ నాలుగు ఫోటోలు, ఆవిష్కర్త పేరు ,ఫోన్ నెంబర్, వయస్సు, ప్రస్తుత వృత్తి, గ్రామం, జిల్లా పేరుతో సహా ఆగస్టు 5వ తేదీ లోగా 910 0678543 కి వాట్సాప్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి సెల్ నంబర్ 9963423691 లో సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని అన్ని రంగాలకు చెందినవారు తమ ఆలోచనలకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలను పెద్ద మొత్తంలో పంపి జిల్లాను ముందు స్థానంలో నిలబెట్టాలని కలెక్టర్ కోరారు. అనంతరం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్ ను జిల్లా అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ నగేష్, జిల్లా అధికారుల సమక్షంలో విడుదల చేసారు.

# ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

మహ్మదాబాద్, జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏసీబీ వలకు అవినీతి చేప చిక్కింది. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలంలోని నంచర్ల గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో భాగంగా మాజీ ఎంపీటీసీ సువర్ణ రూ.4,41,321తో రెండు సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఈ పనులను గతేడాది మార్చిలో పూర్తి చేయగా.. బిల్లులను చెక్కు రూపేణా సువర్ణకు పంచాయతీ కార్యదర్శి పాండురంగం అందజేశారు. కాగా, బిల్లులో తనకు రూ.20 వేలు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో సువర్ణ ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పాండురంగానికి సువర్ణ రూ.9వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని విచారణ చేపట్టారు. పాండురంగంను మంగళవారం నాంపల్లి కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ బి.శ్రీకృష్ణాగౌడ్, ఇన్‌స్పెక్టర్లు లింగస్వామి, ఏఎన్‌కే జిలానీ, అధికారులు ఉన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల తోడ్పాటును అందిస్తుంది - చింతా ప్రభాకర్

సంగారెడ్డి, జూలై 31 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం బైపాస్ రోడ్ లోని పాత డిఆర్డిఏ కార్యాలయంలో గల జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశానికి ఆయన జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ తో కలిసి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల తోడ్పాటును అందిస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని, మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఒక్క రూపాయి కూడా గ్యారెంటీ లేకుండా మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తున్నామన్నారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, మహిళలు మరింత ఉన్నతంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.



జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళల ఒకప్పటి అభివృద్ధికి నేటి అభివృద్ధికి ఎంతో తేడా ఉందని, అప్పుడు స్వయం సహాయక సంఘాలకు 50 కోట్ల రూపాయల రుణాలు ఇస్తే, ఇప్పుడు ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయల రుణాలు అందిస్తున్నదన్నారు.

వడ్డీ లేని రుణాలు ఇస్తూ మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా పెద్ద మొత్తంలో రుణాలు అందిస్తుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆగస్టు మాసాంతం లోపు స్వయం సహాయక సంఘాలకు 500 కోట్ల రూపాయలు అందించడానికి ప్రణాళిక చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కెసిఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య మహిళ, అమ్మ ఒడి తదితర కార్యక్రమాలపై ప్రతి మాసం జరిగే స్వయం

సహాయక సంఘాల సమావేశాలలో ఆయా అంశాలపై మహిళలందరికీ అవగాహన కల్పించాలన్నారు. మహిళలందరూ ఆరోగ్యంగా ఆర్థికంగా ఎదగాలన్నారు. జిల్లాలో 87శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలో జరుగుతున్నాయని, వందకు వందశాతం ప్రభుత్వ ఆసుపత్రులలో జరిగేలా చూడాలని కోరారు. ఆసరా పింఛన్ల కింద జిల్లాలో ప్రతినెల 36 కోట్ల రూపాయల పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వికలాంగుల పింఛన్ 4016 కు పెంచిందని మంజూరు ప్రొసీడింగ్స్ ఈ వారంలోగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావుకు సూచించారు. మహిళలు ఆర్థికంగా బలపడాలని, స్వయం సహాయక సంఘాల వాణిజ్య సముదాయాన్ని తొందరగా పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లాలో సబ్ సెంటర్ భవన నిర్మాణ కాంట్రాక్టు పనులు మహిళా సంఘాలకు ఇచ్చామని,వాటిని త్వరితగతిన పూర్తి చేసి రాష్ట్రానికి జిల్లా సమాఖ్య మహిళలు ఆదర్శంగా నిలవాలన్నారు.

అంతకు ముందు చింతా ప్రభాకర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ జిల్లా సమాఖ్య భవనం ఆవరణలో మొక్కలు నాటారు. షాపింగ్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. మహిళా సమాఖ్య మహిళలు ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించారు. రెన్నోవేశన్ చేసిన భవనంలో పూజా కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, ఏ పి డి సూర్యారావు, కంది జెడ్పీ టిసి, సేర్ప్ సిబ్బంది, డి పి ఎం లు, ఏ పి ఎం లు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, ఉపాధ్యక్షురాలు, కార్యదర్శి, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు, డి ఆర్ డి ఏ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 8 న పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టాలి చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి



ములుగు , జులై 31: (నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బట్ట మురళీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని బీసీ చలో ఢిల్లీ ఆగస్టు 8 తేదీన కులగనన చేయాలని పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టి బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని బీసీ ఉద్యోగుల ప్రమోషన్ లో రిజర్వేషన్ కల్పించాలి కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి బీసీలకు బడ్జెట్ కేటాయించాలి సినిమాలకు షికార్లకు ఉన్న మంత్రిత్వ శాఖలు దేశ జనాభాలో 60 శాతంగా పైగా ఉన్న బీసీలకు మంత్రిత్వ శాఖ లేకపోవడం చాలా బాధాకరం ఏ వర్గాలకు లేని క్రిమిలేరు బీసీలకే ఎందుకు క్రిమిలేయర్ని ఎత్తివేయాలనీ జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో 8న చలో ఢిల్లీ కార్యక్రమానికి ములుగు జిల్లా నుండి సుమారు 100 మంది ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనుటకు వెళ్తున్నారని అన్నారు జంతర్ మంతర్ వద్ద ధర్నా భారీ ప్రదర్శన ఉంటుందని ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షులు ఎంపీ శ్రీ ఆర్ కృష్ణయ్య గారు పాల్గొంటారని బీసీలందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని హాలో బిసి చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా జేఏసీ చైర్మన్ ముంజల బిక్షపతి ,ములుగు జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ కన్వీనర్ తోటకూరి శ్రీకాంత్ ,జాతీయ బిసి సంక్షేమ సంఘం మండల కన్వీనర్ గుండారపు వైకుంఠం, జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మంచర్ల నాగేశ్వరరావు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు బెజ్జంకి రమణాచారి, యూత్ నాయకులు గాజు అజయ్, తదితరులు పాల్గొన్నారు

# రాజకీయాలంటే వ్యాపారం కాదు: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి

### -కమిషన్ తీసుకున్నానని ఎవరైనా అంటే రాజకీయాల నుంచి తక్షణం రిటైర్ అవుతా

ముంబై జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాజకీయాలంటే వ్యాపారం కాదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. కమిషన్‌గా తాను ఏరోజూ ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని చెప్పారు. కమిషన్ తీసుకున్నానని ఎవరైనా అంటే రాజకీయాల నుంచి తక్షణం రిటైర్ అవుతానని అన్నారు. తన చిన్ననాటి ముచ్చట్లు, తన అభిరుచులు, ఇవాల్టి రాజకీయాలతో సహా పలు ఆసక్తికరమైన విషయాలను ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.హిందీ, మరాఠీ, ఆంగ్లంలో తన ప్రసంగిస్తుంటానని, ప్రజలు తన ప్రసంగాలను యూట్యూబ్‌లో వింటుంటారని గడ్కరి తెలిపారు. అమెరికాలో ఎక్కువ మంది తన ప్రసంగాలు వింటుంటారని, ప్రతి నెలా యూట్యూబ్ నుంచి తనకు రూ.3 లక్షల వరకూ వస్తుందని చెప్పారు. భగవంతుడికి తనపై ఎంతో కరుణ ఉందని అన్నారు. ఏమాటైనా ముక్కుసూటిగా చెప్పడానికే తాను ఇష్టపడతానని తెలిపారు. ఉద్యోగం చేయడం కంటే, పదిమందికి ఉద్యోగం కల్పించాలనే ఆలోచన తనకు చిన్నప్పటి నుంచి ఉందని, తన తల్లిదండ్రులు లాయర్‌గా చూడాలని కోరుకున్నప్పుడు తాను ఇదే విషయం వారికి చెప్పానని గుర్తుచేసుకున్నారు. కులం, మతం, భాష పేరుతో ఎవరూ గొప్పవాళ్లు కారని, ప్రవర్తన-లక్షణాల వల్లే ఎవరైనా గొప్పవాళ్లవుతారని అన్నారు.

### కుల రాజకీయాలకు వ్యతిరేకం

కులం గురించి తాను ఎప్పుడూ మాట్లాడనని, తాను ఒక నేతనని, తనకు అన్ని కులాల ఓట్లు కావాలని. అందరూ తనకు సోదరులైనని అన్నారు. కులం గురించి మాట్లాడే వాళ్లను దూరంగా ఉంచమని తాను చెబుతుంటానని తెలిపారు. ఇవాళ తాను ఎలాంటి బిజినెస్ చేయడం లేదని, ఇంతవరకూ చేసిన బిజినెస్ రెండున్నర వేల కోట్ల టర్నోవర్ ఉంటుందని చెప్పారు. తాను బిజినెస్ ప్రారంభించినప్పుడు 15,000 మందికి ఉద్యోగాలు ఇచ్చానని, వారిలో కనీసం 200 మంది తన కులానికి చెందిన వారు కారని అన్నారు. ఇవాళ రాజకీయాల్లో తమ వారికే టిక్కెట్లు ఇచ్చేకునే పరిస్థితి ఉందని సూటిగా చెప్పారు.

# టీఎస్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ నమోదుకు ఆహ్వానం..... జిల్లా కలెక్టర్ శరత్

సంగారెడ్డి, జూలై 31 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ లో 2023-24 విద్యా సంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు ఆన్లైన్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టి ఎస్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుకునే అవకాశం లేని బాల బాలికలకు, వయోజనులకు ఇది చక్కటి అవకాశమన్నారు. 14 సంవత్సరాలు నిండి బడి మధ్యలో మానేసిన వారు, చదువుకు దూరమైన వారు ఓపెన్ స్కూల్లో పదవ తరగతి చదువుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా పదవ తరగతి పూర్తి చేసి 15 సంవత్సరాలు నిండిన వారు ఇంటర్మీడియట్లో చేరవచ్చన్నారు. కళాశాల చదువు మానేసిన వారికి, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన వారికి ఓపెన్ స్కూల్లో ఆన్లైన్లో నమోదు చేసుకుని ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం ఉందన్నారు. మహిళలు, పలు రకాల వృత్తులలో, వ్యాపార రంగాల్లో ఉన్నవారికి, ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు, వివిధ సంఘాల



సభ్యులకు, సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి ఓపెన్ స్కూల్ విద్య చక్కటి అవకాశమని పేర్కొన్నారు. ఎస్ఎస్సి మరియు ఇంటర్మీడియట్ కోర్సులో అభ్యాసకులు వృత్తివిద్య కోర్సును ఒక ఐచ్చిక సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చున్నారు. ఎస్ఎస్సి కోర్సు కు కనీస విద్యా నైపుణ్యాలు కలిగి ఉండాలని, ఇంటర్మీడియట్ కోర్సు కు గుర్తింపు పొందిన ఏదైనా బోర్డు నుండి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఇట్టి సర్టిఫికెట్ లు రెగ్యులర్ 10వ తరగతి, రెగ్యులర్ ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ లకు సమానమని తెలిపారు. ఆయా సర్టిఫికెట్ లకు ప్రభుత్వ గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఇట్టి అవకాశాన్ని జిల్లాలోని ఆసక్తిగల అభ్యర్థులు వినియోగించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఓపెన్ స్కూల్లో ని పదవ తరగతి ,ఇంటర్మీడియట్ కోర్సుల్లో నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ నగేష్, డిఇఓ వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# న్యాక్ ఆధ్వర్యంలో 160మంది మహిళలకు కట్టు మిషన్లు పంపిణీ

మేడ్చల్, జులై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఉపాధి కల్పనలో తెలంగాణ దేశానికే రోల్‌మాడల్‌గా నిలుస్తుందని, స్వరాష్ట్రంలోనే మహిళ సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని, పాలన దక్షతలో మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడంతోనే.. ప్రతి రంగంలో మహిళామణులు దూసుకెళ్తున్నారని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) వారి ఆధ్వర్యంలో 160మంది మహిళలకు కట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం తెలంగాణకే వలస వస్తున్నారని, మహిళలు స్వయం కృషితో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో ఎక్కడా లేవని, మహిళల రక్షణకోసం షీటీమ్స్‌ను ఏర్పాటు చేశారని, అమ్మాయిల చదువు కోసం ప్రత్యేకంగా గురుకులాలు నెలకొల్పిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. మహిళలు కుట్టు మిషన్‌లో ప్రత్యేకతను కనబర్చి, ఇతరులకు ఉపాధిని కల్పించి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు ఏకే మురుగేష్, లలితాయాదవ్, జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, నిహారికగౌడ్, మెట్టు ఆశాకుమారి, లావణ్యసతీష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, శారదామనోహర్‌రెడ్డి, పల్లపు రవి, వేణు, కోఆప్షన్‌సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, న్యాక్ అధికారులు, నాయకులు సాధిక్, ప్రకాష్, నవీన్‌యాదవ్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్, హైదరాబాద్ జిల్లా శాఖా ఎన్నికలలో మామిడి భీమ్ రెడ్డి ప్యానల్ విజయం

హైదరాబాద్ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇండియన్ రెడ్ క్రాస్, హైదరాబాద్ జిల్లా శాఖ కు జరిగిన ఎన్నికల్లో రాష్ట్రపతి బంగారు పతక గ్రహీత మామిడి భీమ్ రెడ్డి ప్యానల్ వరుసగా మూడవ సారి విజయం సాధించింది.మామిడి భీమ్ రెడ్డి తో పాటు 14 మంది సభ్యులు భారీ మేజారితి తో ఘన విజయం సాదించారు.వీరిలో 1. విజయ్ కుమారి 2. వీరమణి 3. ఎ. వి రావు 4. డా. ఓ. శ్రీనివాస్ రెడ్డి 5. పురుషోత్తం6. రఘు అరికపూడి7. ఠాగూర్ జై వీర్ సింగ్ 8. అబ్దుల్ సద్దాం9. సందెష్10 వినయ్ కిశోర్ 11.నాగేందర్ 12. అభిషేక్ 13. ప్రసన్న రాణి 14.జ్యోతి విజయం సాధించారు. భీమ్ రెడ్డి వరుసగా మూడవ సారి గెలిచిన సందర్భంగా హైదరాబాద్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ కృష్ణా యాదవ్, సత్య నారాయణ రెడ్డి,సుప్ర భా, నరసింహ రెడ్డి, తదితరులు సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణా యాదవ్ మాట్లాడుతూ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సమాజ సేవ చేస్తున్న మన రెడ్ క్రాస్ ముద్దు బిడ్డ భీమ్ రెడ్డి అన్న కు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని భగవంతుడు అన్న కి ఆయుః ఆరోగ్యాలు ప్రసాదించాలని కోరారు.

# సీబీఐ, సిట్‌కు దర్యాప్తు అప్పగించినంత మాత్రన సరిపోదు

### - బాధిత మహిళలకు సత్వర న్యాయం అందేలా చూడాలి
### -కేంద్రాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ జూలై 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో మహిళలపై మే ప్రారంభం నుంచి జరుగుతున్న అమానుషాలపై ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారని కేంద్రాన్ని సుప్రీంకోర్టు సోమవారంనాడు నిలదీసింది. సీబీఐ, సిట్‌కు దర్యాప్తు అప్పగించినంత మాత్రన సరిపోదని, బాధిత మహిళలకు సత్వర న్యాయం అందేలా చూడాలని, ఇప్పటికే మూడు నెలలు గడిచిపోయాయని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఇంతవరకూ ప్రభుత్వం ఏమి చేసిందనే దానిపైనే సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే విషయం ఆధారపడి ఉంటుందని, ప్రభుత్వ చర్యలతో సంతృప్తి చెందినట్లయితే తాము జోక్యం చేసుకోవాల్సి అవసరం ఉంటుందని సీజేఐ అన్నారు. దీనిపై కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదన వినిపిస్తూ, మణిపూర్ హింసపై జరుగుతున్న విచారణను సుప్రీంకోర్టు పర్యవేక్షించేందుకు కేంద్రానికి ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు.

సీజేఐతో పాటు జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ముందు మణిపూర్ హింసకు సంబంధించిన పలు పిటిషన్లు విచారణకు వచ్చాయి. వీటిపై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. మే 4న విడుదలైన వీడియోలో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, ఆ ఇద్దరు బాధిత మహిళల తరఫున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబాల్ వాదన వినిపించారు. ఈ కేసును సీబీఐ విచారించాలన్న కేంద్రం అభిప్రాయంతో పాటు, అసోం రాష్ట్రానికి కేసు బదిలీ చేయాలన్న విషయంలోనూ బాధిత మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారని, ఇందుకు వారు అంగీకరించడం లేదని సిబాల్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై తుషార్ మెహతా స్పందిస్తూ, అసోంకి కేసును బదిలీ చేయాలని తాము చెప్పలేదన్నారు. వేరే రాష్ట్రమని మాత్రమే ప్రస్తావించామని తెలిపారు. సీబీఐ విచారణను సిబాల్ వ్యతిరేకిస్తూ, అసోంకి కాకుడా వేరే రాష్ట్రానికి కేసు బదిలీ చేయాలన్నారు. మణిపూర్‌లో లైంగిక వేధింపులు ఆగలేదని, రిలీఫ్ క్యాంపులు దారుణంగా ఉన్నాయని, శాంతిభద్రతలను తిరిగి పాదుకొలపడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. బాధితులు పదేపదే కోర్టుకు రాలేరని, విచారణకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టును కోరారు.

దీనిపై సీబీఐ స్పందిస్తూ, మే 3వ తేదీ నుంచి అల్లర్లు మొదలయ్యాయని అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారో చెప్పాలని, మణిపూర్‌లో ఇళ్ల పునర్నిర్మాణానికి కేంద్రం ఎలాంటి ప్యాకేజీ ప్రకటించిందని ప్రశ్నించారు.

# వరద బాధితులకు చేయూతనందించిన ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్

ములుగు , జులై 31: (నేటినిజం ప్రతినిధి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉండగా ప్రజల ఆస్తి ప్రాణ నష్టం జరగడం చాలా శోచనీయం అన్నారు ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మరియు ములుగు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాదం ప్రవీణ్ ...

వైపరీత్యాలకు, విపత్కర పరిస్థితులలో ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంత వరద బాధితులకు చేయూత అందించడం తమ బాధ్యతగా భావించి ఈరోజు ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున ఐదు లక్షల 50వేల విలువగల నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందన్నారు

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని ఊరట్టం,కన్నేపెల్లి, కొత్తూరు,కాల్వపల్లి గ్రామ పంచాయతీలో సుమారు 200 కుటుంబాలకు 1నెలకి సరిపడా సరిపడా 25 కేజీల బియ్యం మరియు 5 కేజీల కందిపప్పు మూడు కేజీల వంటనూనె 1/2 కేజీ చింతపండు అరకేజీ అల్లం ఉల్లిగడ్డ 100 గ్రాముల ఒకటి రింగ్ సబ్బు ఒకటి సంతూర్ సబ్బు కేజీ ఉప్పు 10 బిస్కెట్ ప్యాకెట్లు కిలో కారం మూడు కేజీల ఉల్లిగడ్డ నిత్యవసర సరుకులను బాధిత కుటుంబాలకు అందజేసిన ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బృందం.... కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బాదం ప్రవీణ్,ప్రధాన కార్యదర్శి వాసుదేవ రెడ్డి, కోశాధికారి విజేందర్,శ్రావణ్ కుమార్, అనిల్ కుమార్ ప్రదీప్ హరినాథ్, సూర్య తేజ, పాపిరెడ్డి

ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బృందంతో పాటుగా జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, ఆఓఆఊబా అప్పయ్య, ఎమ్మార్వో శ్రీనివాస్, తానువాయి ఎంపీడీవో సత్య ప్రసాద్ ,నాఎ ఓంకార్ యాదవ్,ఎంపీపీ శ్రీవాణి,జిల్లా ఎంపీటీసీ ల ఫోరం అధ్యక్షులు పోరిక విజయ్ రామ్ నాయక్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కోగిల మహేష్,తాడ్వాయి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు దండగుల మల్లయ్య, స్థానిక సర్పంచ్ శ్రీధర్ మరియు తదితరులు పాల్గొన్నారు..







విశాలాక్షి సాహిత్య మాస పత్రిక
మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ - విజయవాడ
సంయుక్త ఆధ్వర్యంలో కథల పోటీ

తెలుగు కథ ఔన్నత్యాన్ని చాటి చెబుతూ విలువలకు ప్రతీకగా నిలిచే తెలుగు కథలను ఆహ్వానిస్తున్నాము. సహృదయ తెలుగు కథకులందరికీ మా స్వాగతం.

బహుమతుల వివరాలు

ప్రథమ బహుమతి రూ. 6000/-
ద్వితీయ బహుమతి రూ. 5000/-
తృతీయ బహుమతి రూ. 4000/-
ప్రత్యేక బహుమతులు రూ. 7000/- (ఒక్కో కథకు రూ. 1000/-లు చొప్పున 7 కథలకు)

- కొత్త కథ కావాలి, పాత కథలు, తిరిగి వచ్చినవి వద్దు
- డిటిపిలో 4 పేజీలు, చేతివ్రాతలో 7 పేజీలు మించరాదు
- రచనలు నేరుగా క్రింది చిరునామాకు పంపాలి మెయిల్, వాట్సప్‌లకు అనుమతి లేదు
- హామీ పత్రంలోనే మీ వివరాలు రాయాలి. కథ మీద రాయకండి.
- ఒకరు ఒక కథ మాత్రమే పంపాలి.
- విశాలాక్షి ద్విదశాబ్ది ఉత్సవాల్లో విజేతలకు బహుమతులతో పాటు జ్ఞాపికలతో సత్కారం
- మరింత సమాచారం కోసం సం॥ 800 856 2742 వాట్సప్ మెసేజ్ మాత్రమే.

కథలు చేరవలసిన చివరి తేది 19-08-2023

రచనలు పంపవలసిన చిరునామా
VISALAKSHI MASA PATHRIKA
D.No. 27-5-487, Padmavathi Nagar,
Balaji Nagar Ext,Nellore - 524002.
Cell : 800 856 2742

